క్లుప్తంగా

ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతం చేయండి


మాట్లాడుతున్న తోట ఆగయ్య

వేములవాడ: ప్రతి మండల కేంద్రంలో చేపట్టే ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. స్థానిక ఎమ్మెల్యే నివాసం సంగీత నిలయంలో మంగళవారం నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, పెండింగ్‌ పనులను ఎమ్మెల్యే రమేశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో పుల్కం రాజు, మ్యాకల ఎల్లయ్య, గోస్కుల రవి, మల్యాల దేవయ్య, కేతిరెడ్డి సత్తిరెడ్డి, దెగావత్‌ తిరుపతి, కమలాకర్‌ పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో నేరెళ్ల పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్‌ జిందం రేఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కమల, ఎంపీటీసీ రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌ దేవదాస్‌, నాయకులు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలు విజయవంతం


కంటి ఆపరేషన్‌ చేసుకున్న వారితో వైద్యులు

వేములవాడఅర్బన్‌: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ఒక్క రోజు ఏడు కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రేగుల పాటి మహేశ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటిలో మోతిబిందుతో బాధపడుతూ, కంటి వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన కుంటయ్య, లక్ష్మి, సుశీల, వెంకవ్వ, సంఘవ్వ, రాజు, లక్ష్మికి కంటి ఆపరేషన్లు ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా చేసినట్లు తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ అసుపత్రి సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వైద్యులు రత్నమాల, నర్సింగం, రాజేందర్‌ పాల్గొన్నారు.

‘నీరు’గారిన బృహత్తర పథకం

- ముస్తాబాద్‌లో పైపులైన్‌ ధ్వంసం
- చివరి గ్రామాలకు చేరని నీరు
- మిషన్‌ భగీరథతోనే నెట్టుకొస్తున్న వైనం

ముస్తాబాద్‌: పుష్కరకాలం క్రితం నీటి ఎద్దడి నివారణకు నాటి ప్రభుత్వం ప్రారంభించిన బృహత్తర తాగునీటి పథకం అటకెక్కింది. మిషన్‌ భగీరథ పథకం రావడంతో రెండు మండలాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన మంచినీటి పథకాన్ని నీరుగార్చారనే విమర్శలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పథకం అమలు తీరు ఎలా ఉందో చూసేవారే కరువయ్యారు. ముస్తాబాద్‌, గంభీరావుపేట మండలాలకు తాగునీటిని అందించేందుకు 2010లో అప్పటి కాంగ్రెస్‌ ప్రభుత్వం కొళ్లమద్ది వద్ద నీటి ప్రాజెక్టును చేపట్టింది. 55 ఆవాసాలకు నీటిని అందించేందుకు చేపట్టిన పనులు అప్పట్లో ఆలస్యంగా జరిగాయి. దీంతో అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్‌ అధికారులను చిప్పలపల్లి గ్రామసభలో నిలదీశారు. పథకం వృథాగా ఉంటోందని, ఎప్పుడు ప్రారంభించి ప్రజల దాహార్తిని తీరుస్తారో చెప్పాలని ప్రశ్నించారు. దీంతో పనులు త్వరగా పూర్తిచేసిన అధికారులు, ఎట్టకేలకు నీటి సరఫరాను ప్రారంభించారు.

‘మిషన్‌’ రాకతో పర్యవేక్షణ కరువై..

ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ప్రభుత్వం మిషన్‌ భగీరథను ప్రారంభించింది. ఇంటింటికి నల్లా అనే లక్ష్యంతో ప్రత్యేక పైపులైన్‌ వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీంతో కొళ్లమద్ది నీటి పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొళ్లమద్ది పథకంతో సంబంధం లేకుండా మిషన్‌ భగీరథలో రెండు మండలాల్లో ప్రత్యేక పైపులైన్‌ నిర్మించారు. దీంతో మిషన్‌ భగీరథలో వచ్చే నీటినే గ్రిడ్‌ అధికారులు అందించారు. కొళ్లమద్ది పథకం గురించి పట్టించుకోలేదు, అధికారుల పర్యవేక్షణ కూడా లేకుండా పోయింది. ఇదిలా ఉండగా మిషన్‌ భగీరథ పథకంలో వస్తున్న సాంకేతిక సమస్యలతో నీటి సరఫరా ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో కొళ్లమద్ది పైపులైన్‌ వ్యవస్థతోపాటు ఓవర్‌హెడ్‌ ట్యాంకులు, నీటి శుద్ధి కేంద్రాన్ని వినియోగించుకుంటున్నారు.


పగిలిపోయిన పైపులు

పైపులైన్‌ అస్తవ్యస్తం..

చిప్పలపల్లి నుంచి నామాపూర్‌, ముస్తాబాద్‌, మద్దికుంట, మోహినికుంట మీదుగా బందనకల్‌, వెంకట్రావుపల్లె వరకు కొళ్లమద్ది పైపులైన్‌ నిర్మించారు. రోడ్డు విస్తరణలో పైపులైన్‌ చాలా చోట్ల ధ్వంసం అయ్యింది. ముస్తాబాద్‌, మోహినికుంట, మద్దికుంట పరిసర ప్రాంతాల్లో పైపులైన్లు దెబ్బతిన్నాయి. చాలా గ్రామాల్లో బండలు ఉన్న చోట పైపులైన్‌ను పైనుంచే వేశారు. పలు నిర్మాణాల్లో పైపులైన్‌ను ధ్వంసమైంది. ఐరన్‌ పైపులను కొద్దిమంది ఎత్తుకెళ్లారు. ముస్తాబాద్‌ శివారులో ఈ పైపులైన్‌ విడిభాగాలు రోడ్డు పక్కన పడివున్నాయి. మరికొన్ని విడిభాగాలు దొంగల పాలయ్యాయి. ప్రస్తుతం కొళ్లమద్ది తాగునీటి వ్యవస్థను కొద్ది గ్రామాలకే పరిమితం చేసినట్లు తెలుస్తోంది.


రోడ్డు పక్కన పడేసిన పైపులైన్‌

వేసవిలో దాహార్తిని తీర్చేది..

మిషన్‌ భగీరథతో చివరి గ్రామాలైన వెంకట్రావుపల్లె, బందనకల్‌, తెర్లుమద్ది, పోతుగల్‌, సేవాలాల్‌ తండా, మొర్రాపూర్‌ గ్రామాలకు సరైన నీటి సరఫరా జరగడం లేదు. ఇప్పటికీ నాలుగు, వారం రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతోంది. అయితే ఈ వేసవిలో కొళ్లమద్ది పథకం సరిగా వుండివుంటే ప్రజలకు నీటి ఇబ్బంది తప్పేదని పలువురు భావిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా ఈ పథకం ప్రజలకు ఉపయోగపడేదన్న వాదనలు వినపడుతున్నాయి. ముఖ్యంగా గ్రిడ్‌ అధికారులు కొళ్లమద్ది పథకాన్ని వినియోగంలోకి తీసుకురావడంలో విఫలమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి.

పైపులైన్‌ బాగుచేయాలి


పన్నెండేళ్ల క్రితం వేసిన పైపులైన్‌ను సద్వినియోగం చేయాలి. ఈ వేసవిలో ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా చూడాలి. కొళ్లమద్ది నీటి పథకం పైపులైన్‌ను బాగుచేయాలి. మిషన్‌ భగీరథకు ప్రత్యామ్నాయంగా దీనిని ఉపయోగించుకోవాలి.

– ఎదునూరి గోపి, ముస్తాబాద్‌

ఇందిరమ్మకాలనీకి సరఫరా చేయాలి


ముస్తాబాద్‌ ఇందిరమ్మ కాలనీలో తరచూ నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు నీటి ట్యాంకులు ఉన్న మిషన్‌ భగీరథ నీరు సరిపోవడం లేదని అంటున్నారు. ఎండాకాలంలో నీరు మంచిగా వచ్చేలా చేయాలి. డబుల్‌ బెడ్రూం ఇళ్లకు నీరు సరపరా చేయాలే.

– విజయ, ముస్తాబాద్‌

పథకం వినియోగంలో ఉంది


భగీరథ పైపులైన్‌ బాగుచేసేందుకు అధికారులకు నివేదించాం. వేసవిలో నీటి సరఫరా సవ్యంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొళ్లమద్ది పథకం వినియోగంలో ఉంది. కొన్ని గ్రామాలకు నీటి సరఫరా నిలిచింది. వారికి మిషన్‌ భగీరథలో నీటిని ఇస్తున్నాం.


– సుకన్య, ఏఈ, మిషన్‌ భగీరథ



కల్యాణం.. కమనీయం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లిలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ-జమదగ్నిల వివాహం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల శిగాలు, బైండ్లవారి గాండ్రింపులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బైండ్ల పూజారులు పట్నం వేయగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గౌడ సంఘం సభ్యులు లక్ష్మీనారాయణ, భూమేశ్‌, నాగరాజు, తిరుపతి, సురేశ్‌గౌడ్‌, అంజయ్యగౌడ్‌ పాల్గొన్నారు.

అటెన్షన్‌ ప్లీజ్‌



రోడ్డును కమ్మేసిన ముళ్ల పొదలు

చందుర్తి: మండలంలోని మూడపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నర్సింగపూర్‌ గ్రామంలోని ఎస్సీ కాలనీ వరకు ఉన్న తారు రోడ్డుకు పక్కన ఉన్న ముళ్ల పొదలు రోడ్డును పూర్తిగా కమ్మేశాయి. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలకు సైడ్‌ తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ముళ్ల పొదలు తొలగించాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్‌ శాఖ ఏఈ, చందుర్తి
ఫోన్‌ నెం: 98661 79335

రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వ నిధులు

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌

బోయినపల్లి: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి జరిగిందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ అన్నారు. మండలంలోని స్తంభంపల్లి, గుండన్నపల్లి, విలాసాగర్‌ గ్రామాల్లో ఈజీఎస్‌ నిధులు రూ.48.20 లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. స్తంభంపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

శెనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

బోయినపల్లి ఏఎంసీలో ఏర్పాటు చేసిన శనిగల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వర్లపల్లి వేణుగోపాల్‌, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, ఏఎంసీ చైర్మన్‌ లెంకల సత్యనారాయణరెడ్డి, వైస్‌చైర్మన్‌ సుధాకర్‌రావు, సర్పంచు గుంటి లతశ్రీ, సెస్‌ డైరెక్టర్‌ కొట్టెపల్లి సుధాకర్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మండల కో ఆప్షన్‌ మహ్మద్‌ అజ్జు, సంబ లక్ష్మిరాజం, గుంటి శంకర్‌, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌

వడ్డీ లేని రుణాల ప్రొసీడింగ్స్‌ పంపిణీ


ప్రొసీడింగ్స్‌ పంపిణీ చేస్తున్న నాయకులు

బోయినపల్లి: మండలంలోని తడగండ గ్రామంలో మహిళా స్వశక్తి సంఘాలకు వడ్డీలేని రుణాల ప్రొసీడింగ్స్‌ కాపీలను సర్పంచ్‌ చిందం రమేశ్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య మంగళవారం అందచేశారు.

వీర్నపల్లి: మండలంలో 267 పొదుపు సంఘాలకు మంజూరైన పావులా వడ్డీ ప్రొసీడింగ్‌ కాపీలను ఎంపీపీ మాలోత్‌ భూల వీవో అధ్యక్షులకు, వీవోఏలకు మంగళవారం అందజేశారు.

గణిత మెటీరియల్‌ విడుదల

సిరిసిల్ల ఎడ్యుకేషన్‌: అంతగిరి జెడ్పీహెచ్‌ఎస్‌ పనిచేస్తున్న మహమ్మద్‌ ఫరీదుద్దీన్‌ తయారు చేసిన గణిత మెటీరియల్‌ను కలెక్టరేట్‌ కార్యాలయంలో డీఈవో రమేశ్‌ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈవో భన్నాజి, పరీక్షల నియంత్రణాధికారి అజీమ్‌, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ‘పై’ దినోత్సవం

సిరిసిల్లఎడ్యుకేషన్‌/రుద్రంగి: సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌, రుద్రంగి కృష్ణవేణి టాలెంట్‌ స్కూల్‌లో ‘పై’ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు గణిత శాస్త్ర విశిష్టతను వాటి విలువలను ఉపాధ్యాయులు తెలియజేశారు. పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నీట్‌ పీజీ ఫలితాల్లో 2014 ర్యాంకు

వేములవాడ: నీట్‌ పీజీ ఫలితాల్లో వేములవాడ పట్టణానికి చెందిన కొమురవెల్లి సుదీప్‌వాస్‌ 2014వ ర్యాంకు సాధించారు. మంగళవారం రాత్రి వెలువడిన ర్యాంకుల్లో ఈ ర్యాంకు దక్కినట్లు సుదీప్‌వాస్‌ తెలిపారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం

- ఆస్పత్రి సూపరింటెండెంట్‌ బాబు

ఎల్లారెడ్డిపేట: క్షయవ్యాధిపై అందరికీ అవగాహన ఉండాలని అస్పత్రి సూపరింటెండెంట్‌ బాబు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో క్షయవ్యాధిపై మంగళవారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా గర్భిణులు, మధుమేహగ్రస్తులు, వృద్ధులు, క్యాన్సర్‌, అస్తమా లాంటి వ్యాధులతో బాధపడుతున్న వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రెండు వారాలు మించి దగ్గు, జ్వరం, రాత్రివేళ చెమటలు, ఆకలి మందగించడం, బరువుతగ్గడం వంటి లక్షణాలతో బాధపడేవారు వెంటనే ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. నిక్షయ్‌ యోజన పథకం కింద నెలకి రూ.500తో పాటు స్థానికంగా ఉన్న ఆశ్విని అస్పత్రి వైద్యులు సత్యనారాయణస్వామి బియ్యం, నిత్యావసర వస్తువులు అందిస్తున్నారు. సమావేశంలో వైద్యులు రఘు, ప్రదీప్‌, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్‌ బాబు

ధర్మారంలో..

కోనరావుపేట: మండలంలోని ధర్మారం గ్రామపంచాయతీ వద్ద క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ గున్నాల అరుణ, ఉపసర్పంచ్‌ తీగల వెంకటి, కార్యదర్శి అభిలాష్‌, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచారం

16న మైనారిటీ కార్పొరేషన్‌ రుణాలకు ఇంటర్వ్యూ

తంగళ్లపల్లి: మండల వ్యాప్తంగా 2022–23 సంవత్సరానికిగాను మైనారిటీ కార్పొరేషన్‌ లోన్‌ కొరకు దరఖాస్తు చేసుకున్న మైనారిటీ సోదరులకు ఈ నెల 16న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.లచ్చాలు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు 16న ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్‌ కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

పంటల నమోదు పరిశీలన


పంటల నమోదు పరిశీలనలో ఎంఏవో

బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లి, గుండన్నపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంఏవో ప్రణిత యాసంగిలో పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా 20 సర్వే నంబర్లలో రైతులు వేసిన పంటలను ప్రత్యక్షంగా చూసి పంటల నమోదు చేశారు. పొలాల్లో పురుగు ఆశించడం తదితర దుష్ప్రభావాలు కలిగితే తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గూర్చి తెలియ చెప్పారు. ఏఈవో సాహితి ఆమెతో పాటు ఉన్నారు.

అగ్గి తెగులు పరిశీలన


బొల్లారంలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడరూరల్‌: మండలంలోని బొల్లారం గ్రామంలో వ్యవసాయ అధికారులు వరి పంటలను పరిశీలించారు. ఇటీవల వరి పంటకు అగ్గి తెగుళ్ల, కాండం తొలుచు పురుగు సోకడంతో వాటి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులకు వివరించారు. ప్రధానంగా ట్రై సైక్లోజోల్‌ 120 గ్రాములు, కార్డ్‌ ఆఫ్‌ హైడ్రోక్లోరైడ్‌ 400 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఏవో సాయికిరణ్‌, సర్పంచ్‌ సుద్దాల లచ్చయ్య, విస్తరణ అధికారి సందీప్‌, రైతులు పాల్గొన్నారు.

మైనార్టీ స్వయం ఉపాధికి ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

ముస్తాబాద్‌: మండల పరిషత్‌లో మైనార్టీ కార్పొరేషన్‌ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 4 యూనిట్లు మంజూరు కాగా, 224 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఎస్‌బీఐ, యూనియన్‌ బ్యాంక్‌ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌, కెడీసీసీ బ్యాంక్‌ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. మేనేజర్లు శ్రీనివాస్‌, శ్రావణ్‌రావు, చందర్‌, హరిప్రియ పాల్గొన్నారు.

గోశాలకు రాజన్న కోడెలు


కోడెలను అందజేస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్‌: వేములవాడ మున్సిపల్‌ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను మంగళవారం వరంగల్‌ జిల్లా రాయపర్తి మండలం జింకురంతండాకు చెందిన శ్రీ బాలజీ గోశాలకు 20 కోడెలను అందజేశారు. ఆలయ అధికారులు శ్రీనివాస్‌, శంకర్‌ పాల్గొన్నారు.

మహిళా చైతన్యమే ప్రధానం

- మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మాధవి
- మహిళల ర్యాలీ

వేములవాడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వేములవాడలో మున్సిపల్‌ ఆధ్వర్యంలో మహిళలతో 2కే రన్‌, మహిళల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ మాధవి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళపాత్ర కీలకమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లోనూ 50 శాతం మహిళలకు కేటాయించిందన్నారు. మహిళాభివృద్ధే దేశాభివృద్ధి అన్నారు. కార్యక్రమంలో కమిషనర్‌ అన్సారి, మేనేజర్‌ సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.


వేములవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

తంగళ్లపల్లిలో వాహన తనిఖీలు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో సిరిసిల్ల రూరల్‌ సీఐ బి.ఉపేందర్‌ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ, డ్రంకెన్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్‌ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు చలా నాలు విధించారు. ఎస్సై లక్ష్మారెడ్డి, సిబ్బంది ఉన్నారు.


వాహన తనిఖీలు చేస్తున్న రూరల్‌ సీఐ ఉపేందర్‌

సంక్షిప్త వార్తలు

‘డబుల్‌’ ఇళ్లు కేటాయించాలి

ఇల్లంతకుంట: అర్హులైన వారందరికీ డబుల్‌ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మండల ప్రధానకార్యదర్శి నాగసముద్రాల సంతోష్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పొత్తూరు, కందికట్కూర్‌, పెద్దలింగాపూర్‌, ఓబులాపూర్‌ గ్రామాల్లో నిర్మించిన డబుల్‌ బెడ్రూం ఇళ్లను కేటాయించడంతో పాటు, ఇంటి స్థలం ఉన్న పేదలందరికీ మంజూరు చేయాలన్నారు. ఇళ్లు పూర్తయి రెండేళ్లు కావస్తున్న ఇప్పటి వరకు లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించ లేదన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్లఅర్బన్‌: ఫీజు కట్టలేదని హాల్‌ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్న ప్రైవేట్‌ జూనియర్‌ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు వంగ అనిల్‌కుమార్‌ డీఐఈవోకి వినతిపత్రం అందజేశారు.

ప్రత్యేక బస్సులు నడిపించాలి

వీర్నపల్లి: ఇంటర్‌ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్‌: మండలంలోని చిప్పలపల్లిలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను సర్పంచ్‌ జ్యోతి పంపిణీ చేశారు.

వీడ్కోలు

వేములవాడఅర్బన్‌: మండలం అనుపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం మంగళవారం నిర్వహించారు. జెడ్పీటీసీ మ్యాకల రవి, సర్పంచ్‌ వెంకటరమణారావు ఎస్‌ఎంసీ చైర్మన్‌ సునిత, పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

ముస్తాబాద్‌: మేజర్‌ పంచాయతీలో ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి పనులు చేపట్టామని సర్పంచ్‌ గాండ్ల సుమతి స్పష్టం చేశారు. గ్రామచావడి వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్‌ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్‌, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్‌ - 7997958211
టోల్‌ ఫ్రీ నెం.: 1800 425 9899